కుంతెన సూర్యనారాయణ రాజు

# ముష్టి సామ్రాట్

శివన్‌కోయిల్ ముందు కారు దిగి టెంకాయి కొని లోనికెళ్ళి దైవదర్శనం చేసుకుని సుకుమార్ తిరిగి వస్తూంటే తను పది సంవత్సరాల క్రితం మద్రాసులో వుండే రోజుల్లో అప్పుడున్న చోట్లోనే ఇప్పుడూ కూర్చుని అడుక్కునే కుంటి బిచ్చగాణ్ణి ఆశ్చర్యంగా చూసాడు. అతడు అప్పుడెలావున్నాడో యిప్పుడూ అలాగేవున్నాడు. అతని జీవితంలో పెద్దమార్పు వచ్చినట్టు తనకు కనిపించలేదు. జాలిగా అతగాణ్ణి చూస్తూ నిలబడి పోయాడు.

వాడు మాత్రం లేని దైన్యాన్ని ముఖంలో ప్రదర్శిస్తూ చెయ్యి ముందుకు చాచి "ధర్మం సామీ!" అన్నాడు. వెంటనే సుకుమార్ రూపాయినోటు తీసి వాడి చేతిలో పెట్టాడు. కృతజ్ఞతా భావంతో వాడి కళ్ళు చెమర్చాయి. ఈ లోగా ప్రక్కనున్న బిచ్చగాళ్ళు 'సామీ! సామీ'! అంటూ అతగాడిచుట్టూ మూగేసారు. చిల్లర లేదు ఐదు నోటుందన్నాడు. అందరూ కుంటివాణ్ణి చూపి అడగమన్నారు. అతడు ఐదురూపాయల చిల్లరాయిచ్చాడు. అందరికీ ఐదు, పదిపైసల బిళ్ళలు దానం చేసి చెయ్యిదులుపుకుని కారెక్కాడు.

కారు కాస్తంత ముందుకెళ్ళాక పాతమిత్రుడు పళని సామి కనిపించాడు. తనైతే అతనిని ఆనవాలు పట్టాడు. పళనిసామి తనవైపే చూస్తున్నాడు. కారాపి దిగి అతని దగ్గరకెళ్ళి భుజంతట్టి "నేనెవరో గుర్తున్నానా!" అన్నాడు పళనిసామి ఆశ్చర్యపోతూ "అరెరె! ఆండవా! ఆండవా! సుకుమార్ తంబీ! ఏమప్పా నిండా సౌఖ్యమా! ఎక్కడుంటున్నారు. అడడా! ఏమీ పది వర్షంలో (పదిసంవత్సరాల్లో) ఎంతమారి పూడ్చారు (పోయారు). రాండి కాస్త కాఫీ సాపాటు సేద్దిరిగాని" అంటూ హోటల్ వైపుకు నడిపించుకు పోయాడు.

సుకుమార్ "బెజవాడలో ఉంటున్నాను. వ్యాపారం చేస్తున్నాను. అన్నట్టు అడగడం మరిచాను పెళ్ళిచేసుకున్నావా! పిల్లలెంతమంది?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు. అదేం వినిపించుకోకుండా పళనిసామి కాఫీహోటల్ అయ్యర్ని పిలుస్తూ "రెండు కాఫీ స్పెషల్ కుడంగా" అన్నాడు. ఇద్దరూ చెరో కుర్చీలో కూర్చున్నారు. సుకుమార్ వద్దని ఎంత చెప్పినా వినలేదు. కాఫీలు రెండూ రావడంతోటే ఇద్దరూ సిప్ చేసారు. పళని సామి సుకుమార్‌ని పర్సు తీస్తుంటే తియ్యనివ్వకుండా తానే బిల్లు పే చేసాడు.

బయటికి వచ్చాక "ఇప్పుడు సెప్పసార్ యిక్కడ కేం పనిమీదొచ్చావు? నాకు కళ్యాణమయింది. రెండు పిల్లలు. ముందు కూతురు, మీద కొడుకు. మరి నీకెంత మంది పిల్లలు" అన్నాడు పళనిసామి.

"నాకు పిల్లలు లేరు" అంటుండగానే సుకుమార్ గొంతు బొంగురుపోయింది.

"అడడా! పరవాయిల్ల సామీ! ఏమంత వయసొచ్చేసినాది. విశేసాలు సెప్పు" అన్నాడు.

"అన్నీ బాగానే వున్నాయి. అన్నట్టు పళనిసామీ అటు చూసావా! ఆ కుంటాడు పాపం నేను పదేళ్ళ క్రితం వడపళనిలో ఇక్కడున్నప్పుడెలా వున్నాడో యిప్పుడూ అలాగే వున్నాడు" అంటూ అతగాడిపట్ల జాలిపడ్డాడు.

పళనిసామి సుకుమార్ చెప్పిన కుంటాణ్ణి చూసి బిగ్గరగా నవ్వి "యారప్పా! వాడా రాజవేలు. నీకు తెలియదప్పా! వాడికి బేంకిలో పదివేల రూపాయల దుడ్డు వుంది" అన్నాడు బీడీ వెలిగిస్తూ.

"అబ్బే! నువ్వు సరదా కంటున్నావు" అన్నాడు సుకుమార్. పళనిసామి ప్రక్కనున్న బడ్డీ కొట్లో కూర్చున్న తెలుగు దేశం నుంచొచ్చిన సాయిబు గార్ని పిలిచి "ఏమప్పా! సాయిబూ! రాజవేలు దగ్గర దుడ్డు ఎంతుంటుందో సెప్పు" అన్నాడు.

"సార్! ఆ సందులో కనబడే పండ్ల దుకాణం ఆడిదే! అంతే కాదు. రోడ్డు కెదురుగా వున్న ఆ చిన్న కాఫీ హోటల్ కూడా వాడిదే. లీజుకిచ్చేసాడు. అదిగో ఆ భోజన హోటల్ దగ్గర పళ్ళు అమ్మే బండి పెట్టాడే వాడు రాజవేలు కిరాయి మనిషే! ఇవన్నీ కాకుండా చీటీ కంపెనీ నడిపిస్తున్నాడు. బ్యాంకులో పదివేలు డబ్బుంది" అన్నాడు. సుకుమార్ ఆశ్చర్యపోయాడు. ఇన్ని వుండి కూడా వాడెందుకు అడుక్కుంటున్నట్టు అంటూ తనలోతాను తర్కించుకున్నాడు.

పళనిసామి బడ్డీ దగ్గరకు బేరమొస్తే సాయిబును వెళ్ళి పొమ్మన్నాడు. అతగాడు వెళ్ళి పోయాకా సుకుమార్ వీపుపై తడుతూ "ఇప్పుడు నమ్ముతావా" అన్నాడు. "బాప్‌రే! మొత్తానికి కుంటాడ సాధ్యుడే!" అన్నాడు. ఈలోగా ఓ మధ్య వయస్కురాలు వారి ముందునుంచే సుకుమార్ కారు ప్రక్కగా నడిచిపోతోంది. పళనిసామి ఆమెను సుకుమార్‌కి చూపిస్తూ "ఆమెదా ఆడి కీప్. దానికి ఇద్దరు కూతురులు" అన్నాడు.

సుకుమార్ బుర్ర గిర్రున తిరిగిపోయింది. అవిటి వాడని తాను వాడిపై సింపథీ చూపాడేకాని వీడంతటి గ్రంధ సాంగుడని వూహించలేకపోయాడు. ముందుకు సాగారిద్దరూ. సుకుమార్ డోర్ తీసి కారెక్కిఅన్నాడు.

సుకుమార్‌కి బుర్ర గిర్రున తిరిగిపోయింది. అవిటివాడని తాను వాడిపై సింపథీ చూపాడే గాని వీడింతటి గ్రంధ సాంగుడని ఊహించలేక పోయాడు. ముందుకు సాగారిద్దరూ. సుకుమార్ డోర్ తీసి కారెక్కి "పళనిసామీ! నాకారు పాండీ బజారు వరకూ వెళుతుంది వస్తావా" అన్నాడు. పళనిసామి ఆనందంగా "నానుదా గీతా కేఫ్ దగ్గర దిగుతాను" అన్నాడు బాక్‌డోర్ తీసి కూర్చుంటూ.



కారు కోడంబాకం ఓవర్ బ్రిడ్జ్ దాటింది. పానగల్ పార్కు రాగానే పళనిసామి సుకుమార్‌ని కారాపమని మేడమీదున్న చిన్న బోర్డు చూపిస్తూ ఆ బోర్డు చదవమన్నాడు. సుకుమార్ అది చదివాడు. ''వేలూ చిట్ ఫండ్స్'' అని వుంది .''ఆరి పీడసాథ్యం కూల మరిదాన్ని ప్రవేట్ లిమిటెడ్ కూడా చేస్తాడేమో కొన్నాళ్ళకి'' అన్నాడు. ''అది కూడా శీఘ్రమే జరుగుతుందప్పా! పోనియ్'' అన్నాడు.

గీతా కేఫ్ ముందు కారాగింది. పళనిసామి దిగి సుకుమార్‌కి నమస్కరించి నాలుగడుగులేసి వెనక్కొచ్చి ''సుకుమార్ తంబీ! అటుసూడు ఆ కిళ్లీ కొట్టుకూడా రాజవేలు తమ్ముడు తంగవేలుది.'' అన్నాడు.

''సరే! నేవెళ్ళొస్తానని'' సుకుమార్ కారు పోనిచ్చాడు. అతనికి రాజవేలే పదే పదే గుర్తొస్తున్నాడు. తన ఊహాపథంలో రాజవేలు మహారాజులా సింహాసనం మీద కూర్చున్నట్టు అతని ముందు వాడు పాలించే ముష్టి సామ్రాజ్యానికి ముష్టి మహామంత్రి. ముష్టి సైనికులు బారులు తీరివున్నారు. అతగాడు అందర్నీ ఆజ్ఞాపిస్తున్నాడు. వంది మాగధులు ''ముష్టి సామ్రాట్ రాజవేలు గారికీ బహుపరాక్'' అంటూ కైవారం చేస్తున్నారు.

తేనాంపేట్ సెంటర్‌లోకెళ్ళగానే రెడ్‌లైటు వెలిగింది. వాహనాలన్నీ ఆగిపోయాయి. తనూ ఊహాపథంలోంచి బాహ్యస్మృతి లోకొచ్చాడు.

*